గంట వర్షానికే మునిగింది!

వరదనీటిలో పలు కాలనీలు

–కార్పొరేషన్, వరంగల్ వ్యవసాయం, కాజీపేట, సుబేదారి, న్యూస్‌టుడే


అంబేడ్కర్‌భవన్ రోడ్డులో..


గోపాలపూర్‌లో

నగరంలో సోమవారం సాయంత్రం గంట వ్యవధిలో కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 4 గంటలకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో కాలనీల్లో వరద పోటెత్తింది. హనుమకొండ బస్టాండ్ వర్షపు నీటిలో మునిగింది. ప్రశాంత్‌నగర్, ఎస్వీఎస్ కాలనీ, భవానీ నగర్, అంబేడ్కర్ భవన్, ఆర్‌ఈసీ కాలనీ, కేయూ వంద అడుగుల రోడ్డు, ప్రశాంత్‌నగర్, కాజీపేట డీమార్ట్, ఎన్‌ఐటీ సమీపంలోని రామకృష్ణ కాలనీల్లో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. భవానీనగర్ వద్ద ఉన్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇంటిలోకి నీరు చేరింది. అశోక్‌నగర్, గోకుల్‌నగర్ కాలనీల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ఉదయం వరకు ఎండ వేడిమి, ఉక్కపోతతో ఉడికిపోయిన నగరం సాయంత్రం భారీ వర్షంతో చల్లబడింది. వరంగల్ పాత బీటుబజారు, బట్టలబజారు, గోపాలస్వామిగుడి, పోచమ్మ మైదాన్ సెంటర్లో భారీ వర్షం పడింది. బీటుబజారు, పాత నవీన్ టాకీస్ గల్లీలోని దుకాణాల్లోకి వరదనీరు చేరింది. గంటపాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులు, ఉద్యోగులను అప్రమత్తం చేశారు. డీఆర్‌ఎఫ్ టీం, ప్రజారోగ్య విభాగం పారిశుద్ధ్య కార్మికులు రంగంలోకి వరదనీళ్లను క్లియర్ చేశారు. మూడు గంటలపాటు ప్రజా రవాణకు అంతరాయం ఏర్పడింది.

వర్షపాతం ఇలా(మి.మీ)

కాజీపేట: 65.05, గుడికొండ 56.3, హసన్‌పర్తి 40, ఐనవోలు 39, కాశిబుగ్గ 34, నెక్కొండ 33


ప్రశాంత్‌నగర్ తేజస్వి పాఠశాల ముందు..


హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల ఇబ్బంది


హనుమకొండ ఎక్సైజ్ కాలనీ రోడ్డులో వరదనీటిని క్లియర్ చేస్తున్న కార్మికులు


బాలసముద్రంలో


అశోక్ కాలనీలో..

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, పేద ప్రజలు

సుబేదారి, న్యూస్‌టుడే: పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ, జ్యోతి బసునగర్ నివాసం ఉంటున్న పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఇళ్లు ఇవ్వాలని నినాదాలు చేశారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. గేటు ముందు బైఠాయించి నినాదాలు చేశారు. చక్రపాణి మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి సీపీఎం ఆధ్వర్యంలో పేదలు ఇక్కడ ఉంటున్నారన్నారు. విద్యుత్తు బిల్లులు, నగరపాలక సంస్థ పన్ను చెల్లిస్తున్నారన్నారు. జీవో నెంబర్ 58 ప్రకారం దరఖాస్తులు చేసుకున్నా ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం లేదన్నారు. అనంతరం అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ధర్నాలో సీపీఎం నాయకులు వాసుదేవరెడ్డి, రమేశ్, మల్లేశం, రాజు, కుమారస్వామి, భాస్కర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సారు.. కొంచెం సైడ్ ఇవ్వరూ!

–వరంగల్‌క్రైం, కాజీపేట, న్యూస్‌టుడే

పరిశీలన

వరంగల్ నగరంలో.. కార్యాలయానికి వెళ్లే ఉద్యోగి గంట ముందే బయలుదేరుతున్నారు. విద్యార్థులు చివరి గంట కొట్టే వరకు వస్తూనే ఉంటారు.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు గమ్యస్థానం చేరుకోవడానికి ఉరుకులు పరుగులు పెడుతుంటారు.. కారణం ట్రాఫిక్ కష్టాలు. సోమవారం ఉదయం 'న్యూస్‌టుడే బృందం' నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులను పరిశీలించింది.

పరిశీలన సమయం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు



ఆక్రమణలు తొలగిస్తే సరి

హనుమకొండ నక్కలగుట్ట వద్ద ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించి పాదాచారులు నడిచేలా చూడాలి.

కమిషనరేట్ పరిధిలో వాహనాల సంఖ్య ఇలా

కార్లు: 40945/ ద్విచక్ర వాహనాలు: 4,72,360

ఆటోలు:/ 32,150 ఇతర: 1800

ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి నిత్యం 4 వేల నుంచి 5 వేల రాకపోకలు సాగిస్తాయి..



ఇక్కడ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి..

ఎర్రగట్టు గుట్ట జంక్షన్‌లో ఉదయం, సాయంత్రం కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనాల వల్ల సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం ప్రధాన లోపం.. – భీమారం

నగరంలో అడుగడుగునా ట్రాఫిక్ చిక్కులు

ఎక్కడ పడితే అక్కడే ఆటోలు



కాజీపేట చౌరస్తాలో ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలుపుతున్నారు. ప్రయాణికుడి కనిపించగానే ఆటోలు అక్కడికే రావడం వల్ల వెనుక వైపు నుంచి వస్తున్న వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. –మడికొండ



పార్కింగ్ స్థలం ఉంటే మేలు..

హనుమకొండ చౌరస్తా నుంచి విజయ టాకీస్‌కు వెళ్లే రోడ్డులో పార్కింగ్ స్థలం లేదు.. వాహనాలను రోడ్లపై నిలుపుతున్నారు.

ఇవీ సమస్య..

- పోలీసు కమిషనరేట్ పరిధిలో రోజురోజుకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. రహదారులను మాత్రం అందుకు తగ్గట్లు విస్తరించలేదు.
- కాజీపేట నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వరకు ఒకే రోడ్డు ఉండడంతో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటోంది.
- నగర విస్తీర్ణం, వాహనాల రద్దీ దృష్ట్యా 400 మంది వరకు ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉండాలి.. 250 మంది మాత్రమే ఉంటున్నారు..

ట్రాఫిక్ నియమాలు పాటించాలి - ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

వాహనాల రద్దీకి తగ్గట్టుగా రహదారుల విస్తరణ లేదు. దీని వల్ల పలు ప్రాంతాల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి.

రహదారులను బాగు చేయాలి..



హనుమకొండ- కరీంనగర్ రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ రహదారులు ధ్వంసమయ్యాయి. ఎప్పటికప్పుడు బాగు చేయాలి..

- ఆటోలు వంతెన మీద నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ట్రాఫిక్ ఆగిపోతుంది.
- సిద్ధార్థనగర్ వద్ద పాదచారుల కోసం జీబ్రాక్రాసింగ్ లేకపోవడంతో వారు ఎక్కడ పడితే అక్కడ చిన్న పిల్లలను పట్టుకుని రోడ్డు దాటుతున్నారు.
- గ్రేబ్రియల్, బిషప్‌బరెట్టా పాఠశాలకు వెళ్లిన వాహనాలు తిరిగి ప్రభావతి ఆసుపత్రి రోడ్డు నుంచి తిరిగి రావాలి.. కొందరు దర్గా రోడ్ మీదుగా ఎదురుగా రావడం వల్ల అంతరాయం కలుగుతోంది.
- కాజీపేట డీమార్టు ముందు లారీలు ఎఫ్‌సీఐ వైపునకు మలుపు తిరుగుతుండగా వెనక వచ్చే వాహనాలు ఆగుతున్నాయి.
- మూడు పాఠశాలల సమయం ఒకే విధంగా ఉండటంతో పాఠశాలలకు వచ్చే వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది.
- ఒక్క విద్యార్థిని దింపడానికి కూడా పాఠశాలలకు కార్లు తీసుకు రావడం వాహనాల సంఖ్య ఎక్కువ అవుతుంది.

అసంపూర్తి వంతెన పూర్తి చేస్తే మేలు

కాజీపేటలో అసంపూర్తిగా ఉన్న రైల్వే పైవంతెన నిర్మాణం పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుంది.. నగరం ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ దిశగా కార్యాచరణ ప్రారంభించాలి.

కాజీపేట రైల్వే వంతెన వద్ద అస్తవ్యస్తం

కాజీపేటలో ఉన్న రైల్వే ఇరకువంతెన పైన ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉంది. కానిస్టేబుళ్లు ఉన్నప్పటికీ ట్రాఫిక్ నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. సిద్ధార్థనగర్ వద్ద వంతెన కింది భాగాన మూడు పాఠశాలలు ఉండటంతో ఉదయం 8.30 నుంచి 9 గంటలకు వరకు ట్రాఫిక్ విపరీతంగా ఉంటుంది. పిల్లలను ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో పరిమితికి మించి తీసుకెళుతున్నారు. సిద్ధార్థనగర్ వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్ వారిస్తున్నా.. సరైన సమయానికి విద్యార్థులను పాఠశాలకు చేర్చాలనే ఉద్దేశంతో మదర్ థెరిసా జంక్షన్ (చాకలి ఐలమ్మ జంక్షన్) వద్ద యూ టర్న్ తీసుకోవాల్సి ఉండగా.. సిద్ధార్థనగర్ వద్దే తీసుకుంటున్నారు. దీంతో కాజీపేట వైపు వెళ్లే వాహనాలకు ఇబ్బంది కలుగుతోంది. – కాజీపేట, న్యూస్‌టుడే


కాజీపేట ఇరుకు వంతెనపై ఎదురెదురుగా వాహనాలు..

గ్రేటర్ ప్రజావాణిలో 78 వినతులు


కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని వివిధ కాలనీల్లో అంతర్గత రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా.. టౌన్‌ప్లానింగ్ విభాగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు కమిషనర్ డా. అశ్విని తానాజీ దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం బల్దియా సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి 78 ఫిర్యాదులు వచ్చాయి. ఆక్రమణలపై సత్వర చర్యలు చేపట్టాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

హనుమకొండలో సమస్యలిలా: ☛ 48వ డివిజన్ ఇందిరానగర్ ఇంటి నంబరు 24-5-395/20/5 లైన్‌లో తాగునీటి పైపులైను వేయాలి. ☛ 4వ డివిజన్ పెద్దమ్మగడ్డ శ్మశాన వాటికలో వచ్చే నెల 2న నిర్వహించే పూర్వీకుల ఆత్మీయుల పండగకు తగిన ఏర్పాట్లు చేయాలి. ☛ పెద్దమ్మగడ్డ ఎస్సీ కాలనీలో, మడికొండలోని కాలనీల్లో డ్రైనేజీలు నిర్మించాలి. ☛ హనుమకొండ అదాలత్ కూడలిలో ఓ భవన నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది. ☛ హనుమకొండ పోస్టల్ కాలనీలో 40 అడుగుల రహదారి ఆక్రమణకు గురవుతోంది. ☛ హనుమకొండ ప్రాంతంలోని పలు డివిజన్లలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి, ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉద్యోగులపై చర్యలు తీసుకోండి. ☛ 1వ డివిజన్ గుండ్ల సింగారంలో పందుల షెడ్డు తొలగించాలి. ☛ నయీంనగర్ ఇంటి నంబరు 5-11-251 దగ్గర డ్రైనేజీ లేకపోవడంతో మురుగు, వరదనీరు ఆగుతోంది.

పరిశీలించండి.. పరిష్కరించండి


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో వ్యయప్రయాసాలకోర్చి వచ్చి దరఖాస్తులు సమర్పిస్తారని, వాటిని పరిశీలించి పరిష్కరించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవో వెంకటేష్‌లు ప్రజలు అందించిన దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 106 దరఖాస్తులు రాగా వాటిని అధికారులు శాఖ వారీగా చేరవేశారు. సాధ్యం కాని వాటిపై వివరాలు సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని కలెక్టరు ఆదేశించారు.

దివ్యాంగుల పింఛను పునరుద్ధరించండి

హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన వృద్ధురాలు నల్ల మరియమ్మ ఐదు నెలలుగా పింఛను రావడం లేదని భర్త పోషయ్యతో కలిసి వచ్చి కలెక్టరుకు మొరపెట్టుకున్నారు. కలెక్టర్ ప్రావిణ్య వృద్ధురాలి పింఛను పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు.

సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రాన్ని తొలగించాలి

హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్యలో సిమెంట్ బ్రిక్స్ తయారీ చేస్తున్నారని, దుమ్ము,ధూళితో అనారోగ్యానికి గురౌతున్నామని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ప్రావిణ్యకు గ్రామస్థులు పిర్యాదు చేశారు. బండ్ల కనకచారి, గ్యారంపల్లి అశోక్, పి.రాజు, అరవింద్, శ్రవన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూమి విక్రయాన్ని నిలిపివేయాలి

తన పేరు మీద ఉన్న భూమిని మనుమడైన శ్రీకాంత్ అక్రమంగా ఇతరులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్నాడని, ఆ భూమిని ఎవరికీ రిజిస్ట్రేషన్ చేయకుండా నిలుపుదల చేయాలని హసన్‌పర్తి మండలం దేవన్నపేట గ్రామానికి చెందిన వృద్ధుడు సూరం లక్ష్మారెడ్డి తన కూతురుతో వచ్చి ప్రజావాణిలో కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. కలెక్టర్ ప్రావిణ్య స్పందించి పరిశీలించాలని స్థానిక ఎమ్మార్వోను ఆదేశించారు.

కన్న కొడుకు నుంచి కాపాడరూ!


రోదిస్తున్న శేఖర్, భాగ్యలక్ష్మి దంపతులు

ఆ తల్లిదండ్రులకు ఆరుగురు కుమారులు. ఇద్దరు చనిపోగా నలుగురు ఉన్నారు. వీరిలో ముగ్గురు వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. ఒక్క కొడుకు మాత్రం వీరిని హింసించడమే పనిగా పెట్టుకున్నాడు. వీరికి ఏకైక జీవనాధారమైన దుకాణాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకోవడమే కాకుండా సూటిపోటి మాటలతో నిత్యం వేధిస్తున్నాడు. ఇదేంటని అడిగితే తల్లిదండ్రులపై రౌడీలను ఉసిగొల్పుతూ కర్కశత్వాన్ని చాటుతున్నాడు. కన్న కొడుకు తమను వేధిస్తున్న తీరును ప్రజావాణిలో కలెక్టర్‌కు ఆ వృద్ధ దంపతులు చెప్పుకుంటూ భోరున విలపించారు. వివరాల్లోకెళ్తే.. హనుమకొండ బాలసముద్రం ప్రాంతానికి చెందిన బిట్ట శేఖర్, భాగ్యలక్ష్మి దంపతులకు ఆరుగురు కుమారులు. వీరికి ఏకైక జీవనాధారం హనుమకొండ టైలర్‌స్ట్రీట్‌లోని నగల దుకాణం. 30 ఏళ్లుగా ఆ దుకాణాన్ని నిర్వహించుకుంటూ కుమారులందరినీ ప్రయోజకులను చేశారు. ఈ కొడుకు మాత్రం రెండేళ్లుగా తల్లిదండ్రులను తీవ్రంగా వేధిస్తున్నాడని, తమ ఏకైక జీవనాధారమైన దుకాణాన్ని దౌర్జన్యంగా లాక్కొని మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కలెక్టరుకు మొరపెట్టుకున్నారు. తాము భయంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని తమ కుమారుడి నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని, దుకాణాన్ని తమకు అప్పగించాలని ఆ వృద్ధ దంపతులు కలెక్టర్‌ను వేడుకున్నారు.

గూడ్స్ రైల్ బైపాస్ లైన్ మార్చాలి


ఆందోళన చేస్తున్న రైతులు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే, ధర్మసాగర్, న్యూస్‌టుడే: గూడ్స్ రైల్ బైపాస్ లైన్ ప్రతిపాదనను మార్చి తమను ఆదుకోవాలని కోరుతూ ధర్మసాగర్, హసన్‌పర్తి, కాజీపేట మండలాల రైతులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కలెక్టర్‌తో పాటు హనుమకొండ ఆర్‌డీవో వెంకటేష్‌కు వినతి పత్రం అందించారు. అంతకుముందు కలెక్టరేట్ వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు. ఈ ప్రతిపాదనల వల్ల రైల్వే లైను స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం చిల్పూర్ మండలం నష్కల్ మీదుగా కరుణాపురం, రాంపూర్, నర్సింగరావుపల్లి, ఎలుకుర్తి, మడికొండ, ధర్మసాగర్, టేకులగూడెం, ఉనికిచర్ల, దేవన్నపేట, జయగిరి వంటి పలు గ్రామాల మీదుగా హసన్‌పర్తి రోడ్‌కు చేరుకుంటుంది. నాలుగు మండలాల పరిధిలోని పది గ్రామాలో సుమారుగా 20 వేల కుటుంబాలు ప్రత్యక్షంగా నష్టపోతారని, 29 వేల ఎకరాల వరకు సన్న చిన్నకారు రైతులం మా భూములను కోల్పోతామని కలెక్టర్ ప్రావీణ్యకు వివరించారు. కలెక్టర్ ప్రావీణ్య, హనుమకొండ ఆర్‌డీవో స్పందిస్తూ రైల్వే అధికారులు మళ్లీ ఉత్తరం పంపినా, అధికారులు వచ్చినా మీకు సమాచారం ఇస్తామని, దీనిపై సంబంధిత అధికారులతో మీ తరపున మాట్లాడతామన్నారు. రైల్వే బైపాస్ నిరోధిత సంఘం నాయకులు రాజేశ్వర్‌రావు, దామోదర్ రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రావుల వేణుమహేందర్‌రెడ్డి, బేరే రవీందర్, లింగయ్యతో పాటు ధర్మసాగర్, హసన్‌పర్తి, కాజీపేట మండలాల రైతులు పాల్గొన్నారు.

విరులు.. లాభాల సిరులు

నర్సంపేట, ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : బంతి పూల సాగు లాభదాయకంగా ఉండటంతో పలువురు రైతులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు.. స్వల్ప పెట్టుబడి.. తెగుళ్లు, చీడపీడల బాధలు తక్కువే.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం రాజపల్లిలో ఎడ రమేశ్ ఎకరం భూమిలో, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్‌లో రైతు అంబాల కరుణాకర్ ఎకరంలో బంతి సాగు చేశారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో మార్కెట్‌లో ఆశించిన ధర పలుకుతోంది. రమేశ్ తన మిత్రుడి సాయంతో గత జులైలో ఈస్ట్‌వెస్ట్ కంపెనీకి చెందిన బంతి విత్తనాన్ని బెంగళూరు నుంచి తెప్పించి నారు పోసినట్లు తెలిపారు. నారు పోసిన 25 రోజుల తర్వాత మొక్కలు నాటారు. అంతరకృషి, మొక్కలకు ఎరువులు వేశారు. 52 రోజులకు రెక్కల పురుగు నివారణకు పురుగు పిచికారీ చేశారు. పూలు మొత్తం

ఆదర్శం

నాలుగు కోతలు వస్తాయి. మొదటి కోత తొలి బతుకమ్మ(అమావాస్య)కు కోయగా దిగుబడి టన్నున్నర వచ్చింది. కిలో రూ.80 ధర పలికింది. సద్దుల బతుకమ్మకు రెండో కోత మూడు టన్నుల దిగుబడి రాగా, ధర రూ.60-70 వరకు ధర పలికింది. ఈ రెండు విడతలో దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు రమేశ్ వివరించారు.


తోటలో పనులు చేస్తున్న రమేశ్ దంపతులు

రూ.2.5 లక్షలు వస్తాయని అంచనా..
-అంబాల కరుణాకర్, రైతు



రెండేళ్ల నుంచి బంతి సాగు చేస్తున్నాను. సుమారు రూ.3 లక్షల ఆదాయం వస్తుందని అంచనా.. పెట్టుబడి రూ.50వేలు పోగా రూ.2.5 లక్షలు చేతికి వస్తాయి..

ప్రశ్న- సమాధానం

? పత్తి పంటలో ఆకులు నల్లగా మారుతున్నాయి. ఎండిపోయి రాలుతున్నాయి. నివారణ చర్యలు తెలపండి..? -రైతు, రావుల లక్ష్మయ్య, సూధన్‌పల్లి.

✔ బ్యాక్టీరియాతో ఆకులు నల్లగా మారుతున్నాయి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ రెండు గ్రాముల మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంట ఎదుగుదలకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను నేల ద్వారా మొక్కలకు అందించాలి. పైపాటుగా లీటరు నీటికి 10 గ్రాముల యూరియా స్థూల పోషకాల మిశ్రమాన్ని వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
-డా.రాజు, శాస్త్రవేత్త, కేవీకే వరంగల్
-వరంగల్ వ్యవసాయం

రైతేరాజు

ఈ సన్నరకాలకే.. రూ.500 బోనస్!


పాకాల ఆయకట్టులో సాగవుతున్న సన్నవరి

ఖానాపురం, గోపాలపూర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.. అయితే, ఏయే రకాలకు బోనస్ ఇస్తారో తెలియక అన్నదాతలు అయోమయంలో ఉన్నారు. ఇటీవల ఆయా రకాల జాబితాను వ్యవసాయ శాఖకు ప్రభుత్వం విడుదల చేసింది. 33 రకాల సన్నాల వరికి బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించారని వ్యవసాయాధికారి భోగ శ్రీనివాస్ 'రైతేరాజు'కు తెలిపారు. సిద్ది(డబ్ల్యూజీఎల్44), కేపీఎస్ 2874(కంపాసాగర్ వరి-1), సాంబమశూరి, జగిత్యాల వరి-3, జగిత్యాల వరి-2, వరంగల్ సాంబ(వరంగల్ 14), వరంగల్ సన్నాలు, జగిత్యాల మసూరి, పొలాస ప్రభ(జేజీఎల్384), క్రిష్ణ(ఆర్ఎన్నార్2458), మానేరు సోన, తెలంగాణ సోన(ఆర్ఎన్నార్ 15048), వరంగల్ వరి-1119, కూనారం వరి-2, వరంగల్ వరి-2, రాజేంద్రనగర్ వరి-4, కూనారం వరి-1, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, అంజన(జేజీఎల్ 1118), నెల్లూరు మసూరి, ప్రద్యుమ్న సుగంధ సాంబ, శోబిని, సోమనాథ్, ఆర్ఎన్నార్, కేపీఎస్ 6261, జేసీఎల్ 33124, హెచ్ఎంటీ సోన, మారుతేరు సాంబ, మార్టేరు మసూరి, ఎంటీయూ 1271 రకాలు జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు సన్నాలుగా ఉండి 6 మి.మీ పొడవు, వెడల్పు 2 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉన్న పరిమాణాన్ని పరిగణలోకి తీసుకొని సన్నరకంగా గుర్తించి బోనస్ చెల్లిస్తారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా వ్యవసాయాధికారులు వెర్నియర్‌కాలిపర్స్‌తో సూక్ష్మ కొలతలు గణించి ప్రతి వడ్లకుప్పను పరిశీలించి నిర్ధారణ చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా రైతు పండించిన పంట మొత్తాలకు బోనస్ ఇస్తారా..? రైతు భరోసాకు ఇచ్చే కటాఫ్ ఎకరాలకు ఇస్తారో ఇంకా నిర్ణయించలేదు.

-న్యూస్‌టుడే
వరంగల్ వ్యవసాయం

రైతుకు భరోసా.. మాన్‌ధన్ యోజన



కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన ద్వారా వయసు పై బడిన రైతులకు సామాజిక భద్రత కల్పిస్తోంది. గరిష్ఠంగా రెండు హెక్టార్లు(5 ఎకరాలు)లోపు సాగు భూమి ఉండి 18-40 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులు.. అధికారులు, ఉద్యోగులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజినీర్లు ఇతర వృత్తి నిపుణులు దీనికి అనర్హులు.. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నవారు, నిర్దేశించిన దాని కంటే అధిక రాబడి పొందుతున్నవారు, ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందినవారు కూడా పథకంలో చేరడానికి వీల్లేదు.. రైతులు కామన్ సర్వీసు కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలి. ఫొటో, నివాస, ఆదాయ, ధ్రువీకరణ, వయసు నిర్ధారణ, సాగు భూమి పత్రాలు, ఆధార్ కార్డు సమర్పించాలి. పీఎంకేఎం పోర్టల్‌లో నమోదు చేశాక చరవాణి నంబరుకు సందేశం వస్తుంది. ప్రత్యేకంగా పింఛను ఖాతా తెరిచి కార్డు ఇస్తారు. ఇందుకైన ఖర్చు రూ.30లను ప్రభుత్వమే చెల్లిస్తుంది.

వయసు ఆధారంగా ప్రీమియం : పథకంలో చేరిన రైతులు వయసును బట్టి ప్రీమియం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వారు తన వాటాగా రూ.55 చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం రూ.55 కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తుంది. ఏటా వయసును బట్టి ప్రీమియం రూ.3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. 40 ఏళ్లకు పైబడిన వారు రూ.200 చెల్లించాలి. ఇంతే మొత్తం ప్రభుత్వమూ చెల్లిస్తుంది. 60 ఏళ్లు వచ్చే వరకు ప్రీమియం కట్టాలి. ఆ తర్వాత ప్రతి నెలా రూ.3 వేల చొప్పున పింఛను వస్తుంది. ఒకేసారి డబ్బులు కావాలనుకుంటే రైతు కట్టిన, సర్కారు చెల్లించిన మొత్తంలో సగం ఒకేసారి అందజేస్తారు.

నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లిస్తేనే.. -కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

లబ్ధిదారు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛను రూ.1500 ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకు కనీసం అయిదేళ్లపాటు రైతు వాటా నెలవారీ కిస్తీలను నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి.

షట్లర్ శ్రీచేతన్‌శౌర్యకు రెండో ర్యాంకు



వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా సబ్ జూనియర్(అండర్-13) బ్యాడ్మింటన్ ర్యాంకింగ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారుడు శ్రీచేతన్‌శౌర్య తన స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. బాలుర డబుల్స్ విభాగంలో 2వ స్థానంలో, సింగిల్స్‌లో 4వ స్థానంలో నిలిచాడు. ఇటీవల జరిగిన పలు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించి.. వ్యక్తిగత ర్యాంకింగ్‌లో ముందున్నాడు. హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన శ్రీచేతన్‌శౌర్య ఆటతీరు అభినందనీయమని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి రమేష్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు డా.రమేష్‌కుమార్, నాగకిషన్ పేర్కొన్నారు.

అమ్మ కోసం.. సాంకేతిక బాట

యాప్‌పై శిక్షణకు శ్రీకారం

ఇంట్లో కూతురు/కోడలు గర్భం దాల్చితే వారి బాగోగులను పెద్దవాళ్లు చూసుకుంటారు. ఇప్పుడిక ట్రెండ్ మారుతోంది. రానున్న రోజుల్లో ఆధునిక చేదోడు కానుంది. సాంకేతిక బాట పట్టిన గర్భ సంరక్షణ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకట్టుకుంటోంది. నేషనల్ హెల్త్ మిషన్, యునిసెఫ్ భాగస్వామ్యంతో అర్మన్ అనే స్వచ్ఛంద సంస్థ రూపకల్పన చేసిన 'అమ్మ కోసం' యాప్ ప్రయోజనకరంగా మారనుంది. ఇది గర్భిణులు, బాలింతలు, పిల్లల శ్రేయస్సుకు దోహదపడుతుంది.

అమ్మ కోసం యాప్‌ను అమలు చేయడానికి ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఆరు జిల్లాల పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఇటీవల ప్రారంభించారు.
-న్యూస్‌టుడే, డోర్నకల్

ఆరోగ్య కల సాకారం

అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఇమిడి ఉంది. ప్రసవం వరకు జీవితంలో ఒకభాగంగా మారింది. ఇప్పుడు 'అమ్మ-కోసం' యాప్ పురుడు పోసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య సంబంధ అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చే ప్రధాన వనరుగా మారింది. గర్భ ధారణ సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం ఎలా? పిండం ఎదుగుదలను పర్యవేక్షించడం ఎలా.. తదితర అంశాలను తెలుసుకునే వీలుంది. లోపాలుంటే వాటిని ఏవి గమనించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

డౌన్‌లోడ్ ఇలా..

గూగుల్ ప్లేస్టోర్‌లో అమ్మ-కోసం యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. అవసరమైన అనుమతులు అంగీకరించాక లాగిన్ స్క్రీన్ కనిపిస్తుంది.
☛ యూజర్ నేమ్, పాస్‌వర్డు నమోదు చేసి 'రిమెంబర్ మీ' చెక్‌బాక్స్ మీద నొక్కాలి.
☛ తెలుగు ఎంచుకోగానే వెల్‌కమ్ పేజీ 'డ్యాష్‌బోర్డు' కనిపిస్తుంది.
☛ బ్యాక్ గ్రౌండ్‌లో చూపిన విధంగా ఆఫ్‌లైన్‌లో ఉపయోగించుకునేందుకు అన్ని కోర్సులు-లెసన్ పైళ్లను సైతం డౌన్‌లోడ్ చేస్తుంది. ఒకవేళ ఆటోమెటిక్‌గా డౌన్‌లోడ్ కాని పక్షంలో 'సింక్ బటన్'పై క్లిక్ చేస్తే డౌన్‌లోడ్ అవుతుంది.

ఇవీ ప్రయోజనాలు..

☛ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఎల్ఎంఎస్) ద్వారా పీడీఎఫ్, వీడియో, ఆడియో, ఇమేజ్ వివిధ ఫార్మాట్లలో కోర్సు పాఠాల వీక్షణకు ఇది వీలు కల్పిస్తుంది.
☛ కోర్సు లెసన్ పైళ్లకే వెళితే.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న వాటితో పాటు ప్రారంభించని కోర్సుల జాబితా కనిపిస్తుంది. చిట్కాలు అందిస్తుంది
☛ ప్రసవానికి ముందు, తర్వాత చేయాల్సిన వ్యాయామాలను ఇది సూచిస్తుంది
☛ మంచి పోషణకు ఆహారాన్ని తీసుకోవడంలో తోడుంటుంది
☛ బాలింతలకు అవసరమైన సూచనలు చేస్తుంది
☛ పిల్లల విషయంలో జాగ్రత్తలను తెలుపుతుంది.

ఉమ్మడి జిల్లా స్వరూపం

జిల్లా	గర్భిణులు	బాలింతలు	పిల్లలు
మహబూబాబాద్	4930	3943	44837
జయశంకర్ భూపాలపల్లి	2653	2431	24476
హనుమకొండ	4231	3987	45552
వరంగల్	6128	6432	50423
జనగామ	3396	2430	23643
ములుగు	2874	2497	21624

గర్భిణులకు మేలు
- డా.మధుసూదన్, జిల్లా వైద్యాధికారి, శ్రీదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

అమ్మ-కోసం యాప్ గర్భిణులకు ఒక కల్పతరువు. హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిలో గర్భస్థ సమయంలో కొవిడ్, రక్తహీనత, అధిక రక్తపోటు, ప్రసవ పూర్వ రక్తస్రావం, మధుమేహం, గత సిజేరియన్ స్థితి, పిండం ఎదుగుదల ముఖ్యమైనవి. యాప్‌ను ఏఎన్ఎంల ట్యాబ్‌లలో డౌన్‌లోడ్ చేశారు. పదిహేను రోజులకు ఒకసారి ఒక్కో అంశంపై వీరికి ఒక లింక్‌ను ఆడియో/వీడియో రూపంలో పంపిస్తారు.

తెలుగులో సులభంగా అర్థం అవుతుంది
- సీహెచ్ స్వప్న, ఏఎన్ఎం, భూపాలపల్లి



అమ్మ కోసం యాప్ తెలుగులో ఉండటంతో సులభంగా అర్థమవుతోంది. శిక్షణలో గర్భిణులు, వారు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, చికిత్సకి సంబంధించిన అంశాలను వివరించారు.


భూపాలపల్లిలో శిక్షణకు హాజరైన ఏఎన్ఎంలు

నేటి నుంచి రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

వరంగల్ క్రీడావిభాగం : వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ ప్రతినిధి కన్నా తెలిపారు. హనుమకొండలోని తితిదే వేడుకల మందిరంలో అండర్-15 విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే బాలబాలికలు తమిళనాడులో జరిగే జాతీయస్థాయిలో పాల్గొంటారని చెప్పారు.

'కల్వకుంట్ల కుటుంబం ఆస్తుల వివరాలు ప్రకటించాలి'

జనగామ, న్యూస్‌టుడే: 'కల్వకుంట్ల కుటుంబానికి నిజాయతీ ఉంటే, 2014లో మీ ఆస్తులు ఎన్ని, ఇప్పుడెన్ని? అనే వివరాలను ప్రకటించాలని' మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, సంతోష్, హరీశ్‌రావు పలు అధికార కూటమిగా మారి దోపిడీ చేశారని ఆరోపించారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా విపణిలో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్న సభలో శ్రీహరి మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో కమిషన్ల కోసం పనులు తప్ప, అభివృద్ధి జరగలేదని, అందుకే ప్రస్తుతం సమస్యలు పేరుకున్నాయని విమర్శించారు. ఉన్నప్పుడు విద్య, ఉపాధిపై సమీక్షకు గంట సమయం ఇవ్వలేదని, ప్రజా సమస్యలపై మాట్లాడితే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. భారాస నాయకత్వం ఆదేశం కోసం కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్‌రావు, ఈటల పోటీపడుతున్నారని అన్నారు. మూసీ, హైడ్రా విషయంలో వారి మాటలకు పొంతనలేదని, ఒక్కసారైనా కలిసి ఈ అంశాలపై స్పష్టతనివ్వాలని ప్రశ్నించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప సంకల్పంతో ముందుకు వెళ్తోందని వివరించారు.

డమ్మీ తుపాకితో బెదిరించిన దుండగుడికి దేహశుద్ధి


నిందితుడు

దామెర, న్యూస్‌టుడే: డబ్బులివ్వాలని డమ్మీ తుపాకితో కిరాణ దుకాణ యజమానిని బెదిరించిన వ్యక్తికి గ్రామస్థులు దేహశుద్ధి చేసిన సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఊరుగొండకు చెందిన సంపత్ జాతీయరహదారి పక్కన కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి దుకాణం షట్టర్‌ను తట్టి బిస్కెట్ ప్యాకెట్ కావాలని కోరాడు. దీంతో సంపత్ షట్టర్ తెరవగానే.. దుండగుడు డమ్మీ తుపాకి చూపించి డబ్బులివ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవంటూ సంపత్ భయంతో కేకలు వేశారు. స్థానికులు వచ్చి ఆ వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సంపత్ తెలిపారు. దుండగుడు గతంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. నిందితుడిని విచారిస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

పాఠశాలలో సార్వత్రిక ప్రవేశాలు షురూ!

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్ మధ్యకోట ఆర్సెట్ బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ మూరాల శంకరరావు తెలిపారు. సోమవారం ప్రవేశాల ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. ఇతర వివరాలకు పాఠశాలల అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శైలేంద్రకుమార్ 96034 86850 సంప్రదించాలన్నారు.

ప్రజాసేవలో పోలీసులు ముందుంటారు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ప్రజాసేవలో పోలీసులు ముందుంటారని అమరుల ఆశయ సాధనకు పనిచేస్తూ విధుల్లో రాణించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్‌లో అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్‌డే) నిర్వహించారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మృతి చెందిన 241 మంది పోలీసు అమరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య, కర్నల్ రవికుమార్, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్‌తో పాటు ఏసీపీలు ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు సిబ్బంది అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఆర్ఐ స్పర్జన్ సారథ్యంలో సాయుధ పోలీసుల శోక్‌శ్రస్త్ర చేసి మరణించిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రజల సేవ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసులు త్యాగధనులన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు పనిచేయాలన్నారు. నీతి నిజాయతీతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందన్నారు. అమరవీరులు ఎల్లప్పుడూ మన గుండెల్లోనే ఉంటారన్నారు. వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వారికి ఎలాంటి సమస్యలున్నా పోలీసు విభాగం తరపున సహకారం అందిస్తామన్నారు. అనంతరం కమిషరేట్ నుంచి హనుమకొండ మిషన్ ఆసుపత్రి వరకు పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు కలిసి ప్రదర్శన నిర్వహించారు. పోలీసు జాగృతి కళా బృందం సభ్యులు పాల్గొని పోలీసు అమరులకు జోహార్లు అర్పించారు.


అమరవీరుల స్తూపం అలంకరణ


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా. చిత్రంలో పై వరుస(ఎడమ నుండి కుడికి) హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావిణ్య, సత్య శారద, ఎన్‌సీసీ కమాండెంట్ కర్నల్ రవీంద్ర కుమార్ రవి, డీసీపీలు షేక్ సలీమా, రవీందర్. కింది వరస పోలీసు ఉన్నతాధికారులు రవి, మధుసూదన్, నందిరాం నాయక్, సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి


స్మృతి పరేడ్‌లో పోలీసుల నివాళి

నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటా

పాలకుర్తి, న్యూస్‌టుడే: జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం చేసి, మృతి చెందిన లకావత్ శ్రీను కుటుంబ సభ్యులను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ పరామర్శించారు. పాలకుర్తి మండలం మేకలతండాలోని శ్రీను నివాసాన్ని ఆయన సోమవారం సందర్శించి, విలేకరులతో మాట్లాడారు. శ్రీను మృతి ప్రభుత్వ హత్య అని అభివర్ణించారు. గిరిజన బిడ్డ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని వివరించారు. కాంగ్రెస్ నేత యాకాంతరావు ప్రమేయం ఈ ఘటనలో ఉందని తెలిసిందని, పోలీసులు ఉన్నా, అందరికీ శిక్ష పడేలా సీపీ, డీసీపీతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. పోలీసులు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, నాయకులకు ఒత్తాసు పలకడం సరికాదని అసహనం వ్యక్త చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, భాజపా జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రెడ్డి, తండావాసులు గాంధీ నాయక్, సురేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, చిత్రంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, తదితరులు

గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

ఎనుమాముల మార్కెట్: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఎనుమాముల మార్కెట్ యార్డులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకొచ్చి.. గరిష్ఠ ధరను పొందాలన్నారు. తేమ వల్ల రైతులు నష్టపోకుండా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తొలివిడతలో వరంగల్ జిల్లాలోని 14 కేంద్రాల్లో సోమవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభించామని వరంగల్ కలెక్టర్ డా.సత్యశారద పేర్కొన్నారు. మిగతా చోట్ల త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సీసీఐ డిప్యూటీ మేనేజర్ అర్జున్ దవే, జేడీఎం శ్రీనివాస్, డీడీఎం పద్మావతి, డీఎంఓ సురేఖ, మార్కెట్ కార్యదర్శి నిర్మల, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.


పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డా.సత్యశారద తదితరులు

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243


పోటీలో పాల్గొన్న విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందించిన డైరెక్టర్ సునీతారెడ్డి, ప్రిన్సిపల్ మాధవ్‌రెడ్డి

పరీక్ష రాశారు.. ప్రతిభ చాటారు

ఎన్జీవోస్ కాలనీ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడం కోసం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు కొనసాగుతున్నాయి. సోమవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం- లాభ నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. వి.మానస కృష్ణ, ఎం.అక్షర, ఎస్.అభినవ్ ప్రీతమ్ ప్రతిభ చాటి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ గోపు సునీతారెడ్డి, ప్రిన్సిపల్ డా.జి.మాధవ్ రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాపోలు శ్రీనివాస్, నిశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

నిండిపోయిన డంపింగ్‌యార్డు


రాంపూర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

రాంపూర్‌లోని గ్రేటర్ వరంగల్ డంపింగ్‌యార్డులో వ్యర్థాలు పేరుకుపోయాయి. చెత్తను ఎప్పటికప్పుడు పక్కకు నెట్టాల్సిన డోజర్, హిటాచీ యంత్రాలు లేకపోవడంతో చెత్త గుట్టలుగా పోగైంది. డంప్ చేయడానికి స్థలం లేక వాహనాల చోదకులు నానా ఇబ్బందులు పడ్డారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డంపు చేసేందుకు వెళ్లిన వాహనాలు బారులుతీరాయి. స్థలం లేకపోవడంతో రెండు ట్రిప్పులు వేయాల్సిన ట్రాక్టర్లు ఒకే ట్రిప్పునకు పరిమితం అయ్యాయి. - న్యూస్‌టుడే, కార్పొరేషన్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
జులైవాడ 9059585150
బాలసముద్రం 81438 11118
పరకాల 9849211303

శాయంపేట, న్యూస్‌టుడే: శాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో ధరణి రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఉన్న మురుగు కాలువలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. **-రమేశ్, స్థానికుడు**

పంచాయతీ సిబ్బందితో మురుగుకాలువను శుభ్రం చేయిస్తాం **- సత్యనారాయణ, తహసీల్దార్, శాయంపేట**

బాణసంచా స్వాధీనం



కమలాపూర్, న్యూస్‌టుడే: వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి దాడులు చేసి రూ.1,80,550 విలువగల బాణసంచాను, రూ.8,370 విలువగల పొగాకు ఉత్పత్తులు, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గోదాములో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న భూపతి హరికృష్ణపై కేసు నమోదు కోసం కమలాపూర్ పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. బీంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.22,145 విలువగల గుట్కా, ప్యాకెట్లు, అంబర్ పొట్లాలు స్వాధీనం చేసుకున్నారు. గుట్కాను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్న యెలుగం రాజు, నాగ భాస్కర్ అనే ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదుకు కమలాపూర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

ఎల్కతుర్తి (వరంగల్ క్రైం), న్యూస్‌టుడే: గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్న గుట్కాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం ఎల్కతుర్తి బస్టాండ్ వద్ద పాన్‌షాపులో నిల్వ చేసిన రూ.46,450 విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


సంగీత


వినీల్ కుమార్

కమలాపూర్, న్యూస్‌టుడే: కమలాపూర్‌లోని తెలంగాణ ఆదర్శ (మోడల్)పాఠశాల, కళాశాలలో చదివే విద్యార్థులు ఆదివారం హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ ఆటల పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ డా.జి.అనిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-17 వాలీబాల్ విభాగంలో ఎం.సంగీత, అండర్-17 రెజ్లింగ్ విభాగంలో వినీల్ కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వాలీబాల్ పోటీల్లో నాగమణి అనే విద్యార్థిని ద్వితీయ స్థానం సాధించారని ఆమె తెలిపారు.


1999లో హంటర్ రోడ్‌లో జరిగిన నక్సల్స్ కాల్పుల్లో చనిపోయిన శ్రీనివాస్‌రెడ్డిని గుర్తు చేసుకుంటూ ఆయన చిత్రపటాన్ని తుడుస్తున్న భార్య శిరోమణి, పక్కన మనుమరాలు మహిజ


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో 1999లో నక్సల్స్ ఎదురు కాల్పుల్లో చనిపోయిన మహేశ్‌బాబుకు నివాళులర్పిస్తున్న ఆయన మనుమరాలు, సమీప బంధువు


హంటర్‌రోడ్డులో జరిగిన నక్సల్స్ కాల్పుల్లో అమరుడైన మామిడాల శ్రీనివాస్‌కు నివాళులర్పిస్తున్న ఆయన భార్య పద్మ


దుగ్గొండి మండలం నాచినపల్లి(1986) వద్ద జరిగిన కాల్పుల్లో చనిపోయిన వెంకట్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఆయన భార్య రాధ

గుర్తుకొస్తున్నారు..!

విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టి అమరులైన పోలీసులను స్మరించుకునేందుకు హనుమకొండలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమరవీరుల దినోత్సవం సందర్భంగా అక్కడ స్తూపం వద్ద అమరులైన కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కొన్ని కుటుంబాల వారు నాటి సంఘటన గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

-ఈనాడు, హనుమకొండ

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు


హ్యాండ్‌బాల్ విజేతలైన సీకేఎం కళాశాల విద్యార్థులతో ఆచార్య జ్యోతి, అధ్యాపకులు

సుబేదారి(హనుమకొండ), న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు సుబేదారి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుంకరి జ్యోతి బహుమతులు, షీల్డులు అందజేశారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందించారు. జ్యోతి మాట్లాడుతూ అందరి సహకారంతో క్రీడా పోటీలను మూడు రోజుల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించామన్నారు. ఎస్‌బీఐ సుబేదారి బ్రాంచి మేనేజర్ అచ్యుత్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడల వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు.

విజేతలు ఇలా

	విన్నర్స్	రన్నర్స్
కబడ్డీ	సుబేదారి ఆర్ట్స్ కళాశాల	యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మం
ఖోఖో	కేడీసీ, హనుమకొండ	యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మం
సాఫ్ట్‌బాల్	సుబేదారి ఆర్ట్స్‌కళాశాల	వాగ్దేవి కాలేజీ ఫర్ ఫిజికల్ ఎడ్యుకేషన్, హనుమకొండ
బాల్‌బ్యాడ్మింటన్	వాగ్దేవి కళాశాల, హనుమకొండ	సీకేఎం కళాశాల, వరంగల్
హ్యాండ్ బాల్	సీకేఎం కళాశాల, వరంగల్	యూనివర్సిటీ కాలేజీ ఫర్ ఫిజికల్ ఎడ్యుకేషన్, కేయూ
క్రాస్ కంట్రీ	కేడీసీ, హనుమకొండ	తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల, మరిపెడ, మహబూబాబాద్

అక్షరాస్యత పెంపొందించండి..


అక్షరాభ్యాస పుస్తకాలను చూపుతున్న వాలంటీర్లు, నిర్వాహకులు

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజల్లో అక్షరాస్యత పెంపొందించేందుకు కృషిచేయాలని శిక్షణ పొందుతున్న వాలంటీర్లకు జిల్లా విద్యాశాఖ నాణ్యత ప్రమాణాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం హంటర్‌రోడ్డులోని ఓ కేంద్రంలో గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులైన వాలంటీర్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రేరణ ఫౌండేషన్ కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు విద్య, వైద్య ఆరోగ్యంపై 70 మంది మహిళలు చేస్తున్న సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆచార్య రామన్న తదితరులు పాల్గొన్నారు.

టీజీ ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

మట్టెవాడ, న్యూస్‌టుడే: టీజీ ఎప్‌సెట్-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.బైరి ప్రభాకర్ తెలిపారు. సోమవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల ప్రక్రియకు 423 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్(బైపీసీ) పూర్తి చేసి, టీజీ ఎప్‌సెట్‌కు అర్హత సాధించిన విద్యార్థులు బీఫార్మసి, ఫామ్ డీ, ఫార్మాసుటికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ నెల 23 వరకు ధ్రువపత్రాల స్లాట్ ఎంచుకోవచ్చని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. సీట్ అలాట్‌మెంట్ 28న జరుగుతుందని, ఈ నెల 30న ప్రవేశం పొందిన కళాశాలలో చేరాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపిక


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన ఎంఈవో, ఉపాధ్యాయులు

ఐనవోలు, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి పోటీల్లో మైమ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమని ఎంఈవో ఆనందం పేర్కొన్నారు. సోమవారం సింగారం జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన ఐదుగురు విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. గైడ్ ఉపాధ్యాయురాలు మమతను శాలువాతో సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రశర్మ, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ వెంకటమ్మ, ఉపాధ్యాయులు ఫాతిమా మేరీ, మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE
IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT PARKAL
O.S.No. 55 of 2024

Between:-
1. Adapa Mallaiah, 2. Adapa Bathukamma, 3. Adapa Sravanthi, 4. Adapa Bagavathi, 5. Adapa Niharshitha Rep by their mother Adapa Sravanthi ...Plaintiffs

AND

1. The District Collector, Hanumakonda District.
2. The Tahsildar & Sub registrar, Parkal, Hanumakonda District.
3. The S.R.O., Parkal, Hanumakonda District.
4. To Whomsoever it may concern ...Defendants

To
To Whom so ever it may concern
Please take notice that the plaintiffs have filed the above suit for declaration as legal heirs. The above case is posted on **07-11-2024** for your appearance. Therefore if there exists any objection to anyone in declaring the plaintiffs as legal heirs of Late Adapa Srikanth are hereby directed to appear before the Hon'ble court on **07-11-2024 at 10:30 A.M.,** failing which the matter will be decided in your absence.

// BY THE ORDER OF THE COURT//
Sd/- **PORANDLA RAJAIAH**
PORANDLA NAGARANI
ADVOCATES
HANUMAKONDA. Cell: 98497 23366.

PUBLICATION
BEFORE THE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT: ADILABAD
EA No. 22 of 2024
(in CC No. 149 of 2023)

Between:
Sri. Tuniki Srinivas ...**Petitioner/DHr**
And
M/s. Akshara Chit Funds Pvt. Ltd. & Others ...**Respondents/ JDrs**
To
1) M/s. Akshara Chit Funds Pvt. Ltd., R/ by its Manager, **Br.,** H.No. 1-2-21/K14/2, 1st Floor, Beside Samrudhi Lodge, Above Union Bank of India, Mncl 'X' Road, NIRMAL - 504 106 (TS).
Shifted & Merged with: M/s. Akshara Chit Funds Pvt. Ltd., Br. R/ by its Manager, H.No. 4-4-5/13, Above TGB, Collectorate X Road, ADILABAD-504 001. (TS) ...**Respondent /JDr.No. 1**
2) M/s. Akshara Chit Funds Pvt. Ltd., R/ by its MD, **Regd. Office:** H.No. 6-1-225, 2nd Floor, Central Shopping Mall, Opp: Prodduturi Complex, Main Road, HANMAKONDA- 504 091, WGL. ... **Respondent/JDr. No.2**

Whereas the above named Petitioner/ DHr has filed above Execution Petition against you and Notices issued to you by this Hon'ble Commission/ Court are returned as Un-Served. Take Notice that, the above case is posted on **12/11/2024,** for your appearance and counter, if any. You are hereby Summoned to appear before the above said Commission/ Court at **10.30 AM on 12/11/2024** either in person or through an advocate,failing which the matter will be decided as an ex-parte, as per law.

//By order of the Commission//
Date: 21/10/2024.
Sd/- **T. SAMPATH KUMAR,** Advocate
NIRMAL-504106. Cell: **8187047265.**

విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు



హసన్‌పర్తి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిన విద్యార్థి మహ్మద్ ఇసాక్‌ను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అభినందించారు. హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మహ్మద్ ఇసాక్ హైదరాబాద్‌లోని షేక్‌పేట మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 19, 20 తేదీల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు.

అక్రమంగా పట్టా.. పది మందిపై కేసు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: వారసత్వ భూమి పట్టాలో తప్పుడు ధ్రువపత్రాలతో అక్రమంగా భూమి పట్టా చేసుకున్న వ్యక్తితోపాటు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ములుకనూర్ ఎస్ఐ సాయిబాబు సోమవారం తెలిపారు. బాధితులు, ఎస్ఐ తెలిపిన వివరాలు... కొత్తపల్లి గ్రామానికి చెందిన సామల మల్లాచారి, భారతి దంపతులకు రాజ్‌కుమార్, సతీష్ ఇద్దరు కుమారులు. భారతి 2001లో మృతిచెందగా 2002లో మల్లాచారి వనమాలను రెండో వివాహం చేసుకున్నారు. గ్రామ శివారులో 559 సర్వే నంబర్‌లో 33 గుంటలు, 558 సర్వే నంబర్‌లో 21 గుంటల భూమి మల్లాచారికి ఉంది. మల్లాచారి ఏఎస్ఐగా ఉద్యోగ విరమణ పొందారు. తన భర్త పేరు మీద ఉన్న ఉమ్మడి ఆస్తిని చిన్న కుమారుడు సామల సతీష్ తమకు తెలియకుండా తప్పుడు ధ్రువపత్రాలతో 33 గుంటల భూమిని వారసత్వంగా పట్టా చేసుకున్నాడని వనమాల తెలిపారు. కుటుంబ సభ్యులుగా తాము జీవించి ఉన్నప్పటికీ అప్పటి ఇన్‌ఛార్జి తహసీల్దార్, రెవెన్యూ పరిశీలకులడు కుటుంబ సభ్యుల ధ్రువపత్రం జారీ చేసి సతీష్‌కు పట్టాదారు పాసుపుస్తకం జారీ చేసినట్లు బాధితురాలు వివరించారు. కుటుంబ సభ్యుల ధ్రువపత్రం పొందిన సామల సతీష్, ఆయన భార్య స్రవంతి, ఇద్దరు సాక్షులుగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు రఫీ, తిరుపతితోపాటు, రాజు, రజినీకాంత్, సతీష్, సురేందర్, ధ్రువపత్రం జారీ చేసిన ఇన్‌ఛార్జి తహసీల్దార్, రెవెన్యూ పరిశీలకుడు-1 పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, పట్టా రద్దు చేయాలని బాధితురాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూ పీజీ హాస్టల్‌లో దొంగతనం

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం జ్యోతిరావుపులే (న్యూ, పీజీ) బాలుర హాస్టల్‌లో దొంగతనం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దసరా సెలవుల నిమిత్తం విద్యార్థులందరూ ఇంటికి వెళ్లిన సమయంలో హాస్టల్ లోని 4వ గది నెంబర్ కిటికీ బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి దాదాపు 30 మంది విద్యార్థుల విలువైన వస్తువులు, చరవాణులు, ఎలక్ట్రానిక్ వస్తువులు చోరీకి గురైనట్లు విద్యార్థులు వాపోయారు. ఈ ఘటనపై హాస్టల్ సంచాలకులు డాక్టర్ ఎల్. పి.రాజ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

భర్త చెంతకు భార్య!

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈనెల 18న నగరంలోని నయీంనగర్ ప్రాంతంలో చంటి పాపతో రోడ్డుపై ఒంటరిగా ఉన్న మహిళను చూసి స్థానికులు 181కి సమాచారం అందించారు. వెంటనే సఖి సెంటర్ సిబ్బంది పోలీసుల సహాయంతో ఆమెను తీసుకొచ్చి వివరాలు ఆరా తీశారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన తాను ఆంధ్రాకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుని నగరంలో ఉంటున్నామని చెప్పారు. భర్త మద్యం తాగి వచ్చి శారీరకంగా, మానసికంగా వేధించడంతో బయటకు వచ్చానన్నారు. నగరంలో తన భర్త ఎక్కడుంటాడో తెలియడంలేదని వాపోగా, సఖి నిర్వాహకులు ఆమెను విచారించి రెండు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాలకు తిప్పి ఎట్టకేలకు తన భర్త ఆచూకీని కనుగొని సోమవారం సాయంత్రం ఇద్దరికి కౌన్సెలింగ్ నిర్వహించి పోలీసుల సమక్షంలో వారిని ఒక్కటి చేశారు. కార్యక్రమంలో సఖి సెంటర్ నిర్వాహకురాలు హైమావతి, కేస్ వర్కర్ వినీల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: కాజీపేట బాపూజీనగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో 2024-25 విద్యా సంవత్సరానికి ఏడో విడత తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, మెకానిక్, డ్రాఫ్ట్‌మ్యాన్ సివిల్, టర్నర్, డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రాఫర్ ట్రేడ్‌లలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అక్టోబరు 30వరకు ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అర్హులైన వారు ఉదయం 11గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆ తర్వాత వాక్ ఇన్ ప్రవేశాలకు హాజరుకావాలన్నారు. దరఖాస్తు ప్రింట్ కాపీతో పాటు అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని ప్రిన్సిపల్ సూచించారు.

ఎస్సార్ విశ్వ విద్యాలయంలో కార్యశాల


కార్యశాలలో పాల్గొన్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సీనియర్ లీడర్ చంద్రమోహన్ మల్లాడి, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: ఎస్సార్ విశ్వ విద్యాలయంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో 10 రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన ప్రాయోజిత రీసెర్చ్ మెథడాలజీ కార్యశాలను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సీనియర్ లీడర్ చంద్రమోహన్ మల్లాడి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఇటీవలే మృతిచెందిన సామాజికవేత్త రతన్‌టాటాకు నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనారెడ్డి, డాక్టర్ ఎన్.సుమన్‌కుమార్, డాక్టర్ ఎం.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సమాజ సృష్టికర్తలు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మహిళలు సమాజ సృష్టికర్తలని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర కీలకమని డీసీపీ సంజీవ్ అన్నారు. సోమవారం వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిలి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్)లో సంస్కృతి, హిందీ విభాగాల ఆధ్వర్యంలో 'రామాయణంలో స్త్రీ పాత్రల అధ్యయనం, వర్తమాన కాలంలో వాటి ఔచిత్యం' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా.బత్తిని చంద్రమౌళిగౌడ్ అధ్యక్షత వహించారు. ఓయూ సంస్కృతి విభాగం అధ్యక్షుడు, కేడీసీ అధ్యక్షులు డా.కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపల్ డా.సుహాసిని, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా.సురేష్, వివిధ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వాహకులు తెలంగాణ ప్రభుత్వ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం నియమాలను తప్పకుండా పాటించాలని, అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. యాజమాన్యాలు రోగులకు కనిపించేలా ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు.

రోజుకు 5 గ్రాముల ఉప్పు మాత్రమే వాడాలి


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ కె.లలితాదేవి

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: అయోడిన్ లోపం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను అధిగమించాలంటే ప్రజలందరూ అయోడైజ్డ్ ఉప్పు వాడాలని హనుమకొండ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.కె.లలితాదేవి సూచించారు. సోమవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం సమీపంలోని హనుమాన్ జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం చేపట్టిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఉప్పు వాడకాన్ని రోజుకు 5 గ్రాములకే పరిమితం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇఫ్తాదర్ అహ్మద్, పీఓఎంహెచ్ఎన్ డాక్టర్ నాగరాజు, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ సాధించిన కిట్స్ విద్యార్థులు


కిట్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి, అధ్యాపకులతో ఇంటర్న్‌షిప్స్‌కు ఎంపికైన విద్యార్థులు తదితరులు

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు హైదరాబాద్‌లోని మైండ్‌ట్రీ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌లను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వినయ్, హరిప్రియ, వాగ్దేవి, మేఘన, హేమ ఈ ఇంటర్న్‌షిప్‌లు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డితో పాటు ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.సురేందర్, శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ టి.చంద్రబాయి, డాక్టర్ డి.ప్రభాకరాచారి, డాక్టర్ జి.రత్నాకర్, డాక్టర్ సునీత చక్రవర్తి, డాక్టర్ ఎస్.సారిక, కె.శశాంక్, డాక్టర్ కె.జైపాల్, టి.త్రివేణితో పాటు తదితరులు విద్యార్థులను అభినందించారు.

11.50 లక్షల చేప పిల్లల పంపిణీ

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని మత్స్యకార్మికులకు 11.50లక్షల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి తెలిపారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ములుకనూర్‌లో వివిధ గ్రామాలకు చేప పిల్లలను మత్స్యకార్మిక సంఘాలకు పంపిణీ చేశారు. ఎల్కతుర్తి మండలానికి 7.90 లక్షలు, భీమదేవరపల్లి మండలానికి 3.60లక్షల చేప పిల్లలు పంపిణీచేశామన్నారు.

రక్తదాన శిబిరం

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం హనుమకొండ డివిజన్ ఆధ్వర్యంలో భీమారంలోని శ్రీశుభం కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు పోలీసు అధికారులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారికి సీపీ అంబర్ కిషోర్ ఝా సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణ రెడ్డి, సతీష్, ఎంజీఎం రక్తనిధి ఇన్‌ఛార్జి ఆశతో పాటు పలువురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరకాల నియోజకవర్గం

అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరులోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల(గొల్లవాడ)లో తరగతి గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'అరకొర గదులు.. చెట్ల కిందే పాఠాలు' శీర్షికతో సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి, ఎంఈవో విజయ్‌కుమార్ స్పందించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెండెం రాజు, ఉపాధ్యాయులు కిరణ్ తదితరులు ఉన్నారు.

పోలీసు అమరులకు విద్యార్థుల నివాళి



పరకాల, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పరకాలలోని జడ్పీ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు పోలీసులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు


సభ్యత్వాలను నమోదు చేయిస్తున్న భాజపా నాయకులు

దామెర, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ భాజపా సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పాల్గొనాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి అన్నారు. కోగిల్వాయిలో సోమవారం నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు మహేందర్, శ్రీలత, స్పందన తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూమిపై అధికారుల సర్వే

దామెర, న్యూస్‌టుడే: ముస్త్యాలపల్లిలోని అసైన్డ్ భూమిపై బండారి సుజాత ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం రెవెన్యూ, ఎస్సారెస్పీ అధికారులు సర్వే నిర్వహించారు. ఎస్సారెస్పీ కాలువ పరిధి, చుట్టుపక్కల భూముల హద్దులపై సర్వే చేశారు. రైతుల వాంగ్మూలాలు సేకరించి పంచనామా నిర్వహించారు. తహసీల్దార్ జ్యోతివరలక్ష్మిదేవి మాట్లాడుతూ సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆర్ఐలు సంపత్, భాస్కర్‌రెడ్డి, సర్వేయర్ స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.